క్లుప్తంగా

వల్లూరులో ఆధ్యాత్మిక సందడి



వల్లూరులో దేవతామూర్తులకు పూజలు చేస్తున్న పండితులు

కపిలేశ్వరపురం: మండలంలోని వల్లూరులో శనివారం ఆధ్యాత్మిక సందడి నెలకొంది. కొద్ది రోజులుగా దేవతామూర్తులకు పలు ప్రాంతాల నుంచి తీసుకొచ్చిన పుణ్య జలాలతో అభిషేకం చేశారు. వేదపండితుల ఆధ్వర్యంలో మహాకుంభాభిషేకం చేశారు. భక్తులు దేవతామూర్తులను దర్శించుకున్నారు. విశేష అలంకరణలో దేవతామూర్తులు భక్తులకు దర్శనమిచ్చారు.

69 మంది గర్భిణులకు వైద్య పరీక్షలు



అంగరలో గర్భిణులకు పండ్లు అందజేస్తున్న ప్రముఖులు

కపిలేశ్వరపురం: గర్భిణులు తీసుకునే సంపూర్ణ ఆహారం తల్లీబిడ్డల రక్షణతో పాటు ఆరోగ్యకర సమాజ నిర్మాణానికి దోహదపడుతుందని సీనియర్ వైద్యురాలు కె.కన్యాకుమారి అన్నారు. అంగర పీహెచ్‌సీలో వైద్యాధికారి పీఎస్ఎస్‌డీ రత్నకుమారి ఆధ్వర్యంలో గర్భిణుల పరీక్ష శిబిరాన్ని నిర్వహించారు. ప్రధాన మంత్రి సురక్ష మాతృత్వ అభియాన్‌లో భాగంగా డాక్టర్ కన్యాకుమారి 69 మంది గర్భిణులను పరీక్షించారు. వారిలో హైరిస్క్ కేసులుగా 15 మందిని గుర్తించి మెరుగైన చికిత్స కోసం నివేదించారు. ముగ్గురుని మెరుగైన పరీక్షల కోసం ఉన్నతాసుపత్రికి తరలించారు. ఈ సందర్భంగా డాక్టర్ కన్యాకుమారి మాట్లాడుతూ ప్రతి గర్భిణీ క్రమపద్ధతిలో పరీక్షలు చేయించుకోవడమూ, సంపూర్ణ పోషక విలువలున్న ఆహారాన్ని తీసుకోవడం ద్వారా సుఖ ప్రసవానికి అవకాశం కలుగుతుందన్నారు. గర్భిణులకు గ్రామానికి చెందిన వ్యాపారవేత్త రాగం రామచంద్రరావు, మాచరమట్టలుకు చెందిన జిత్తుక వెంకన్న చారిటబుల్ ట్రస్టు నిర్వాహకులు పండ్లు, బ్రెడ్లు అందజేశారు. కార్యక్రమంలో ఎంపీహెచ్ఈఓ జిత్తుక మల్లికార్జునుడు, ఎంపీహెచ్ఎస్ తాతపూడి మేరీ, హెచ్ఈ బి.రామారావు, వైద్య ఆరోగ్య, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

లోక్ అదాలత్‌లో 377 కేసుల పరిష్కారం



కోర్టుల ప్రాంగణంలో లోక్ అదాలత్ నిర్వహిస్తున్న దృశ్యం

రామచంద్రపురం: స్థానిక కోర్టుల ప్రాంగణంలో మండల లీగల్ సర్వీసెస్ కమిటీ ఆధ్వర్యంలో శనివారం జాతీయ లోక్ అదాలత్ నిర్వహించారు. ఇందులో 377 కేసులను పరిష్కరించారు. లోక్‌అదాలత్‌లో రెండు బెంచ్‌లను ఏర్పాటు చేశారు. మొదటి బెంచ్‌ను సీనియర్ సివిల్ జడ్జి ఎస్.రమేష్‌నాయుడు, బెంచ్ మెంబర్‌గా జె.నాగేశ్వరరావు, రెండో బెంచ్‌ను జూనియర్ సివిల్ జడ్జి వై.నాగేశ్వరరావు నాయక్, బెంచ్ మెంబర్‌గా ఎస్.సత్తిరాజు నిర్వహించారు. మొత్తం రూ.49,34,467 విలువైన నాలుగు సివిల్ కేసులు, 365 క్రిమినల్, ఎనిమిది బీఎస్ఎన్ఎల్ పీఎల్ కేసులు పరిష్కరించారు. పోలీస్ అధికారులు పాల్గొన్నారు.

దాళ్వా సాగుకు సమాయత్తం కావాలి

కె.గంగవరం: తొలకరి సాగు పనులు పూర్తి చేసుకున్న రైతులు వెంటనే దాళ్వాకు సమాయత్తం కావాలని వ్యవసాయ శాఖ అధికారి బలుసు రవి సూచించారు. కె.గంగవరంలో శనివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ డిసెంబర్ 31వ తేదీలోగా దాళ్వాకు సంబంధించి వెద జల్లు, సాధారణ విధానాల్లో నాట్ల పనులు పూర్తి చేయాలన్నారు. సాగునీటిని కాలువల ద్వారా విడుదల చేస్తున్నామన్నారు. మెరక భూములు, తొలకరి సాగులో సాగునీటి ఇబ్బంది ఉన్న రైతులు ప్రత్యామ్నాయ పంటలైన అపరాలు, పచ్చిరొట్ట పంటలు వేసుకోవాలని తెలిపారు. తుపాను ప్రభావం తగ్గిందని, నిబంధనలను సడలించి ప్రభుత్వం ధాన్యాన్ని కొనుగోలు చేస్తుందని, రైతులు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

దాడి ఘటనపై కేసు

రాయవరం: ఉమ్మడి స్థలం విషయమై జరిగిన దాడి ఘటనపై కేసు నమోదు చేసినట్లు రాయవరం ఎస్సై జి.నరేష్ తెలిపారు. ఫిర్యాదులో పేర్కొన్న వివరాల ప్రకారం.. నదురుబాదలో బొమ్మత్తుల మల్లేశ్వరరావు, బొమ్మత్తుల కిశోర్‌ల మధ్య స్థలం విషయంలో గొడవలు జరుగుతున్నాయి. ఈ నెల 8న మల్లేశ్వరరావు ప్రహరీ కట్టడానికి పునాది తీశారు. మల్లేశ్వరరావు సోదరుడు కిశోర్, అతని మనుషులు కలసి తవ్విన పునాదిని పూడ్చివేశారు. ఇదేంటని మల్లేశ్వరరావు అడగడానికి వెళ్లగా కిశోర్, అతని మనుషులు దాడి చేయగా, అనపర్తి ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. ఈ మేరకు మల్లేశ్వరరావు భార్య స్వర్ణలత ఇచ్చిన ఫిర్యాదుపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై వివరించారు.

తరలిరాద తనే వసంతం

- కార్తిక వన సమారాధనల సందడి
- ఆటపాటలకు నెలవుగా తోటలు



వన సమారాధనలో భాగంగా మ్యూజికల్ చైర్ ఆడుతున్న మహిళలు

రాయవరం: తరలిరాద తనే వసంతం.. తన దరికిరాని వనాల కోసం.. అన్న సినీ కవి సిరివెన్నెల పదాలను గుర్తుకు తెచ్చేలా ఎక్కడ చూసినా కార్తిక వన సమారాధనల సందడి నెలకొంది. వనాలకు జనం తండోప తండాలుగా వెళ్తున్నారు. క్లస్టర్లోని మండపేట, రామచంద్రపురం నియోజకవర్గాల పరిధిలోని పలు గ్రామాల్లో కార్తిక వన సమారాధనలు జోరుగా నిర్వహించుకుంటున్నారు. కార్తికమాసం, ఆదివారం కావడంతో క్లస్టర్ పరిధిలోని మండపేట, రాయవరం, కపిలేశ్వరపురం, రామచంద్రపురం, కె.గంగవరం, కాజులూరు మండలాల్లోని పలు గ్రామాల్లో వన సమారాధనలు నిర్వహించేందుకు పలువురు ఏర్పాట్లు చేసుకున్నారు. సహపంక్తి భోజనాలు చేసే వారికి ఉసిరి చెట్లు స్వాగతం పలుకుతున్నాయి.

పూజలు చేసి..

క్లస్టర్ పరిధిలోని వివిధ గ్రామాల్లో ఘనంగా కార్తిక వన సమారాధనలు నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. పల్లెల్లోని పంట దిమ్మలపైన, ఖాళీగా ఉన్న హౌస్ సైట్లలో ఈ వేడుకలు నిర్వహిస్తున్నారు. అక్కడే ఉన్న ఉసిరి చెట్ల వద్ద కార్తిక దామోదరుడి చిత్ర పటాలను ఉంచి, ధూప దీప నైవేద్యాలు సమర్పించి పూజాదికాలు నిర్వహిస్తున్నారు. పలు అసోసియేషన్లు, సామాజిక వర్గాలు, ఫ్రెండ్స్ అసోసియేషన్స్, వ్యాపార సంస్థల్లో పనిచేసే ఉద్యోగులు ఇలా పలు వర్గాల వారు వన సమారాధనలు జరుపుకొంటున్నారు. ప్రజాప్రతినిధులు కూడా ఈ వేడుకల్లో పాల్గొని, పార్టీ నాయకులు, కార్యకర్తలు, ప్రజలతో మమేకం అవుతున్నారు.

ఆటపాటలతో బిజీ బిజీ..

వన భోజనాల సమయంలో చిన్నారులు, పెద్దలు అంతా కలిసి ఆటపాటలతో ఉల్లాసంగా, ఉత్సాహంగా గడుపుతున్నారు. చిన్నారులు, పెద్దలు వేర్వేరుగా ఆట పాటల్లో మునిగి తేలుతున్నారు. ముఖ్యంగా మ్యూజికల్ చైర్స్, కళ్లకు గంతలు, ఖోఖో, చెస్, రింగ్ ఆట, క్యారంబోర్డు, హౌసీ తదితర ఆటలతో పాటు పాటలకు అనుగుణంగా నృత్యాలు చేస్తున్నారు. ఈ పోటీల్లో చిన్నారులతో పాటు మహిళలు అధికంగా పాల్గొంటున్నారు. విజేతలకు నిర్వాహకులు బహుమతులు కూడా అందజేస్తున్నారు. కొందరు వన సమారాధనల్లో యాంకర్స్‌ను కూడా ఏర్పాటు చేస్తున్నారు. ఉద్యోగులు, వ్యాపారులు, వివిధ వృత్తులు చేసుకునే వారికి ఆదివారం సెలవు దినం కావడం, ఆట విడుపు కోసం ఎక్కువగా వన సమారాధనల్లో మునిగి తేలుతున్నారు.

సందడే సందడి

రాయవరంలో ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో కార్తిక వన సమారాధన సందడిగా సాగింది. తొలుత ఉసిరి చెట్టు వద్ద పూజలు చేశారు. అందరూ కలసి సహపంక్తి భోజనాలు చేశారు. మహిళలు, చిన్నారులు వివిధ రకాల ఆటలు ఆడారు. ఆర్యవైశ్య సంఘ అధ్యక్షుడు బొడ్డు గోవర్ధనకృష్ణుడు, సెక్రటరీ దిగవల్లి వీరవెంకట చంద్రశేఖర్‌రామకృష్ణ, ట్రెజరర్ బొడ్డు వెంకటరావు, సంఘ నేతలు గ్రంధి రామారావు, వీరభద్రరావు, బ్రహ్మన్న, బొడ్డు రాంబాబు, కాళ్లకూరి సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

నేడు శెట్టిబలిజల ఆధ్వర్యంలో..

రాయవరంలో శెట్టిబలిజ సామాజిక వర్గీయుల వన సమారాధన ఆదివారం నిర్వహించనున్నారు. ఇక్కడి దుర్గమ్మ తల్లి ఆలయ సమీపంలో ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు శెట్టిబలిజ సామాజిక వర్గం నేతలు తెలిపారు.

వన సమారాధనలో పృథ్వీరాజ్

మండలంలోని సోమేశ్వరంలో శనివారం కార్తిక వన సమారాధన నిర్వహించారు. స్థానిక నేత గిరజాల శేషగిరిరావు ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ వేడుకలో వైఎస్సార్ సీపీ యువనేత తోట పృథ్వీరాజ్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కార్తిక వన సమారాధనలు మన సంస్కృతిలో భాగమన్నారు. వన సమారాధనల ద్వారా ప్రకృతి ప్రాధాన్యతను తెలియజేయడమే కాకుండా, అందరి మధ్య ఐక్యతను పెంపొందిస్తాయన్నారు. పృథ్వీరాజ్‌ను సర్పంచ్ ఆరిఫ్, శేషగిరిరావు దుశ్శాలువాతో సత్కరించారు. అంతకు ముందుగా ఉసిరి చెట్టు వద్ద పూజాదికాలు నిర్వహించి, అందరితో కలసి సహపంక్తి భోజనాలు చేశారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నేతలు, ప్రజలు పాల్గొన్నారు.

సుబ్రహ్మణ్యేశ్వరుని సన్నిధిలో..

కపిలేశ్వరపురం: అంగర గ్రామంలోని పార్వతి, ఉమామహేశ్వర, వల్లీదేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయంలో శనివారం కార్తిక వన సమారాధన జరిగింది. ఉసిరి చెట్టు చెంత దేవతా మూర్తులకు పూజలు చేశారు. అంగర, పడమర ఖండ్రిక గ్రామాల పుణ్య దంపతులు పీటలపై కూర్చుని పూజాది క్రతువులు చేశారు. ఆలయ కమిటీ సభ్యులు, ఇరు గ్రామాల భక్తులు కార్యక్రమంలో పాల్గొన్నారు.



సోమేశ్వరంలో వన సమారాధనలో వైఎస్సార్ సీపీ యువనేత పృథ్వీరాజ్



అంగరలో కార్తిక పూజ చేస్తున్న భక్తులు



రాయవరంలో ఆర్యవైశ్య సంఘ కార్తిక సమారాధనలో ఉసిరి చెట్టు వద్ద పూజలు

నేడు వైఎస్సార్ సీపీ వన సమారాధన



గొల్లపుంత రోడ్డులో కార్తిక సమారాధన ఏర్పాట్లను పరిశీలిస్తున్న ఎమ్మెల్సీ తోట, పట్టాభి, నాగబాబు

కపిలేశ్వరపురం (మండపేట): మండపేట పట్టణం గొల్లపుంత రోడ్డులోని సంకా సుధాకర్ లేఅవుట్‌లో ఆదివారం వైఎస్సార్ సీపీ ఆత్మీయుల కార్తిక వన సమారాధనను ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు ఆధ్వర్యంలో నిర్వహించనున్నారు. నిర్వహణ ప్రదేశాన్ని ఎమ్మెల్సీ తోట శనివారం పరిశీలించి నిర్వాహకులకు పలు సూచనలు చేశారు. ఏర్పాట్లపై ఆ పార్టీ నాయకులు వేగుళ్ల పట్టాభిరామయ్య చౌదరి, చాంబర్ ఆఫ్ కామర్స్ చైర్మన్ కాళ్ళకూరి నాగబాబు తదితరులతో చర్చించారు. మండపేట పట్టణం, రూరల్, కపిలేశ్వరపురం, రాయవరం మండలాల నుంచి పార్టీ నాయకులు, కార్యకర్తలు, ఆత్మీయులు, ఇతర ఆహ్వానితులు వేలాదిగా తరలి రానున్నారు. ఈ కార్యక్రమాన్ని విజయం చేయాలని ఆయా మండలాల కన్వీనర్లు ముమ్మిడివరపు బాపిరాజు, పిల్లా వీరబాబు, మేడిశెట్టి గోవింద్, తమలంపూడి గంగాధర రెడ్డి కోరారు.

మళ్లీ జగనన్నే సీఎం కావాలి



ద్రాక్షారామ భీమేశ్వరాలయంలో వేదాశీర్వచనం అందుకుంటున్న మంత్రులు రోజా, వేణు

- మంత్రి ఆర్కే రోజా
- ద్రాక్షారామ భీమేశ్వరాలయంలో పూజలు

రామచంద్రపురం రూరల్: ప్రజలకు సంక్షేమ పథకాలు అమలు కావాలంటే జగనన్నే మళ్లీ ముఖ్యమంత్రి కావాలని రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక, యువజన శాఖా మంత్రి ఆర్కే రోజా అన్నారు. ఈ మేరకు ద్రాక్షారామ మాణిక్యాంబా సమేత భీమేశ్వర స్వామి వారిని వేడుకున్నట్లు ఆమె వివరించారు. రాష్ట్ర బీసీ సంక్షేమ, సినిమాటోగ్రఫీ, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి చెల్లుబోయిన శ్రీనివాస వేణుగోపాలకృష్ణతో కలసి శనివారం ద్రాక్షారామ భీమేశ్వరాలయాన్ని ఆమె సందర్శించారు. తొలుత వారికి ఆలయ ఈఓ పితాని తారకేశ్వరరావు ఆధ్వర్యంలో అర్చకులు స్వాగతం పలికారు. భీమేశ్వరస్వామి, మాణిక్యాంబా అమ్మవార్లకు ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం నంది మండపంలో వేద పండితుల ఆశీర్వచనం అందుకున్నారు. అనంతరం ఆలయ ప్రాంగణంలో మంత్రి రోజా విలేకరులతో మాట్లాడుతూ పంచారామ క్షేత్రం, 12వ శక్తి పీఠమైన ద్రాక్షారామకు ప్రతి ఏడాది కార్తిక మాసంలో వస్తున్నానన్నారు. అమ్మ, స్వామివారి ఆశీస్సులు ముఖ్యమంత్రి జగనన్నకు ఎల్లప్పుడూ ఉండాలని, వారి ఆశీస్సులతో మళ్లీ ముఖ్యమంత్రిగా ఎన్నికై రాష్ట్ర ప్రజల జీవితాల్లో వెలుగులు నింపాలని వేడుకున్నానన్నారు. ఎంపీపీలు అంబటి భవాని, పంపన నాగమణి, సర్పంచ్ కొత్తపల్లి అరుణ, ఎంపీటీసీ సభ్యురాలు తుమ్మూరి సుబ్బలక్ష్మి, మున్సిపల్ చైర్‌పర్సన్ గాధంశెట్టి శ్రీదేవి, మున్సిపల్ విప్ వాడ్రేవు సాయిప్రసాద్, ఆర్డీఓ ఎస్.సుధాసాగర్, తహసీల్దార్ మైలా వెంకటేశ్వరరావు, సీఐ దుర్గారావు పాల్గొన్నారు.



ద్రాక్షారామ భీమేశ్వరాలయ ప్రాంగణంలో జీఎస్టీ ప్రిన్సిపల్ కమిషనర్ నీలం శ్రీధర్ కుటుంబం

జీఎస్టీ ప్రిన్సిపల్ కమిషనర్ పూజలు

జీఎస్టీ అండ్ కస్టమ్స్ ప్రిన్సిపల్ కమిషనర్, ఐఆర్ఎస్ అధికారి నీలం శ్రీధర్ కుటుంబ సభ్యులతో శనివారం ద్రాక్షారామ మాణిక్యాంబా సమేత భీమేశ్వరస్వామివారిని దర్శించుకున్నారు. తొలుత ఆలయ ఈఓ పితాని తారకేశ్వరరావు ఆధ్వర్యంలో ఆలయ అర్చకులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. అనంతరం స్వామి, అమ్మవార్లను దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈఓ తారకేశ్వరరావు స్వామివారి తీర్థప్రసాదాలు, జ్ఞాపికలను అందజేశారు.

వైభవంగా దీపారాధన మహోత్సవం



దీపారాధనను ప్రారంభిస్తున్న సత్తి సుబ్బారెడ్డి దంపతులు

ద్రాక్షారామ (రామచంద్రపురం రూరల్): ద్రాక్షారామ బోసుబొమ్మ సెంటర్‌లో వేంచేసి ఉన్న అలివేలు మంగాదేవి సమేత వేంకటేశ్వరస్వామివారి దేవాలయం వద్ద 32వ కార్తిక దీపారాధన మహోత్సవం శనివారం జరిగింది. ఈ కార్యక్రమాన్ని ప్రముఖ దాత, వెంకటేశ్వరా రైస్ ఇండస్ట్రీస్ అధినేత సత్తి సుబ్బారెడ్డి, సీతారత్నం దంపతుల ఆధ్వర్యంలో వైభవంగా నిర్వహించారు. ఉదయం మేడవరపు శ్రీనివాస చింతామణి, కళ్లేపల్లి రమేష్‌ల బ్రహ్మత్వంలో సహస్ర తులసి పూజ, సాయంత్రం అఖండ దీపారాధన జరిగింది. బ్యాండ్ కచేరి, భజన, ఆర్కెస్ట్రా కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. అనంతరం బాణసంచా కాల్చారు. ఆలయ కమిటీ సభ్యులు గంధం కృష్ణాజీ, కాకిలేటి సూరిబాబు, అన్నాయిపేట సర్పంచ్ పెమ్మిరెడ్డి దొరబాబు, జెడ్పీటీసీ సభ్యుడు మేర్నీడి వెంకటేశ్వరరావు, వైస్ ఎంపీపీ శాకా బాబీ తదితరులు పాల్గొన్నారు.

గొల్లపాలెంలో..

కాజులూరు: గొల్లపాలెంలో కార్తిక దీపారాధన మహోత్సవం శనివారం కన్నుల పండువగా జరిగింది. ఇక్కడి మార్కెట్ సెంటర్‌లోని ఆంజనేయ స్వామి ఆలయం వద్ద తెల్లవారు జామున ఐదు గంటల నుంచి మేళతాళాలతో గ్రామోత్సవం నిర్వహించారు. అనంతరం స్వామివారికి తమలపాకుల పూజ, సింధూర అభిషేకం, మహా కుంభాభిషేకం చేశారు. మధ్యాహ్నం అన్న సమారాధన నిర్వహించారు. సాయంత్రం ఆరు గంటల నుంచి కార్తిక దీపారాధన మహోత్సవం జరిగింది. పరిసర గ్రామాలకు చెందిన మహిళలు, చిన్నారులు పాల్గొని ఆలయ ప్రాంగణాన్ని దీపాలతో అలంకరించారు. భక్తులకు కమిటీ సభ్యులు ప్రసాదం వితరణ చేశారు.

కమ్యూనిస్టు యోధుడు వెంకన్నకు నివాళి



మాచరమట్టలులో దుప్పట్లు పంపిణీ చేస్తున్న ప్రముఖులు

కపిలేశ్వరపురం: ప్రతి వ్యక్తి కుటుంబ అంశాలకే పరిమితం కాకుండా సామాజిక అంశాలపై సైతం పూర్తి అవగాహన కలిగి ఉండాలని కపిలేశ్వరపురం మండలం మాచర మట్టలకు చెందిన సీనియర్ కమ్యూనిస్టు నాయకుడు జిత్తుక వెంకన్న 21వ వర్ధంతి కార్యక్రమంలో పాల్గొన్న వక్తలన్నారు. ఆయన స్వగ్రామం మాచర మట్టలు, కపిలేశ్వరపురం, అంగర గ్రామాల్లో శనివారం వెంకన్న వర్ధంతిని నిర్వహించారు. జిత్తుక వెంకన్న చారిటబుల్ మెమోరియల్ ట్రస్టు నిర్వాహకులు జిత్తుక మల్లికార్జునుడు, జేవీవీ సత్యనారాయణ, జిత్తుక శ్రీనివాసరావు ఆధ్వర్యంలో శనివారం వర్ధంతి నిర్వహించారు. వక్తలు గుత్తి నాగేశ్వరరావు, జిత్తుక చిన వీర్రాజు, పెద్దింశెట్టి లెనిన్‌బాబు, చిట్టూరి నాగేంద్ర ప్రసాద్, మేడిశెట్టి కృష్ణారావు మాట్లాడుతూ పేద, మధ్య తరగతి ప్రజల సమస్యల పరిష్కారానికి జీవితాంతం వెంకన్న కృషి చేశారన్నారు. 21 ఏళ్లుగా వెంకన్న ఆశయ సాధనకు ఆయన కుమారులు కృషి చేయడాన్ని వక్తలు కొనియాడారు. ట్రస్టు నిర్వాహకులు జిత్తుక మల్లికార్జునుడు మాట్లాడుతూ నిరుపేదలను ఆదుకోవాలన్న వెంకన్న ఆశయ సాధనకు ట్రస్టు ద్వారా కృషి చేస్తున్నామన్నారు. సేవా కార్యక్రమంలో భాగంగా అంగర పీహెచ్‌సీలో గర్భిణులకు డ్రై ఫ్రూట్స్, బ్రెడ్‌లను అందజేశారు. కుష్టు వ్యాధి బాధితులు, వృద్ధులకు దుప్పట్లు అందజేశారు. కార్యక్రమంలో రాగం రామచంద్రరావు, వైద్యులు కె.రత్నకుమారి, పి.రత్నకుమారి తదితరులు పాల్గొన్నారు.

చెరువులూ ముంచుతున్నాయి



కాజులూరులో తక్కువ సైజులోనే రొయ్యలను పట్టుబడి చేస్తున్న రైతులు

- ఆక్వా సాగుకు గడ్డుకాలం
- వర్షాలతో వైరస్ బారిన రొయ్యలు
- తక్కువ కౌంట్‌లోనే తప్పని పట్టుబడి

కాజులూరు: ఆక్వా.. ఆదాయాన్ని ఇచ్చే సాగు. ప్రస్తుతం ఇదీ గడ్డుకాలం ఎదుర్కొంటోంది. మిచాంగ్ తుపానుతో కురిసిన వర్షాలు వరి పంటతో పాటు ఆక్వా సాగుపైనా ప్రభావం చూపాయి. రామచంద్రపురం నియోజకవర్గంలో మూడు మండలాల్లో ఆక్వా సాగు జరుగుతోంది. కాజులూరు మండలంలో 8 వేల ఎకరాలు, కె.గంగవరం మండలంలో 3 వేలు, రామచంద్రపురం మండలంలో రెండు వేల ఎకరాల్లో ఆక్వా సాగు చేస్తున్నారు. అయితే తుపాను కారణంగా నాలుగు రోజుల పాటు కురిసిన వర్షానికి వాతావరణంలో మార్పులతో చెరువుల్లో రొయ్యలకు పలు రకాల వైరస్ సోకుతున్నాయి. ఫలితంగా కౌంట్‌కు రాకుండానే వందలాది ఎకరాల్లో చిన్నసైజులో రొయ్యలను పట్టేస్తున్నారు. ఎండలు పుష్కలంగా ఉంటే రొయ్యలు ఆరోగ్యంగా పెరిగి రైతులకు మంచి ఆదాయాన్ని తెచ్చిపెడతాయి. వర్షాలకు తోడు ఆవర్తన ద్రోణి ప్రభావంతో ప్రస్తుతం వాతావరణం మేఘాలు కమ్ముకుని ఉండటంతో ఇబ్బంది వస్తోంది. చెరువు నీటిలో ఆక్సిజన్ లెవెల్స్ తగ్గిపోవడం, పీహెచ్‌లు పెరిగిపోవడం తదితర కారణాలతో పిల్ల వేసిన 20 రోజులకే రొయ్యలు వైరస్ బారిన పడుతున్నాయి. ప్రస్తుత వాతావరణంలో చెరువులకు ముఖ్యంగా వైట్ స్పాట్, రెడ్‌గ్రిల్ వంటి వైరస్‌లు సోకుతున్నాయని రైతులు చెబుతున్నారు. 50 శాతం పైబడి చెరువుల్లో ఈ ఏడాది రొయ్యలు చనిపోతుండగా, మరో 30 శాతం చెరువుల్లో పూర్తి స్థాయి కౌంట్‌కు రాకుండా రొయ్య వైరస్ బారిన పడుతోంది.



90 కౌంట్ రొయ్యలు

కౌంట్‌కు రాకుండానే..

ప్రస్తుత వాతావరణ పరిస్థితుల్లో నెల వ్యవధిలోనే రొయ్యలు వైరస్ బారిన పడుతుండగా అధికశాతం రైతులు 100 కౌంట్‌కు లోపే పట్టుబడి పట్టాల్సి వస్తోంది. చెరువులలో రొయ్యలకు వైరస్ లక్షణాలు కలిపించిన వెంటనే పట్టుబడి పట్టాలి. లేదంటే నష్టం మరింత పెరిగే పరిస్థితి ఉంటుంది. దీంతో రైతులు వ్యాధులను గుర్తించగానే చెరువుల్లో రొయ్యలు కౌంట్‌కు రాకుండానే పట్టి వచ్చిన ధరకు విక్రయిస్తున్నారు. ఈ విధంగా నియోజకవర్గంలో సుమారు నాలుగు వేల ఎకరాల్లో రైతులు నష్టపోయారని అంచనా.

వనామీకి వ్యాధులు

గతంలో రైతులు టైగర్ రొయ్యలను సాగు చేసేవారు. ఈ రకం రొయ్యలకు వైరస్‌లు ఎక్కువగా వస్తుండటంతో నియోజకవర్గంలోని అనేక ఎకరాల్లో రైతులు కొన్నేళ్లుగా వనామి రొయ్యలను పెంచుతున్నారు. పెట్టుబడులలో పెద్దగా వ్యత్యాసం లేకపోయినా వ్యాధులను వనామి తట్టుకుంటుందన్న ఆక్వా టెక్నీషియన్ల సూచనలతో ఈ సాగు చేపట్టారు. అయితే ప్రతికూల వాతావరణానికి వనామీ కూడా వ్యాధుల బారిన పడుతోంది. రూ.లక్షల పెట్టుబడి పెట్టిన రైతులు నష్టాలు చవిచూస్తున్నారు. వరి పటం ఆశాజనకంగా లేక కాలువ శివార్లలో డ్రెయిన్ల వెంబడి ఉన్న పల్లపు పొలాలను చెరువులుగా మార్చి రొయ్యల సాగు చేపడితే అదీ తమను ముంచుతుందని రైతులు వాపోతున్నారు.

చురుగ్గా సీసీ రహదారి నిర్మాణం



నేలటూరులో సీసీ రహదారి నిర్మాణ పనులను పర్యవేక్షిస్తున్న జేఈ రాఘవులు

కపిలేశ్వరపురం: మండలంలోని పలు గ్రామాల్లో 'గడప గడపకూ మన ప్రభుత్వం' నిధులతో సీసీ రహదారులు, డ్రెయిన్ల నిర్మాణ పనులు చురుగ్గా జరుగుతున్నాయి. నేలటూరులో రూ.2.25 లక్షలతో సీసీ రోడ్డు పనులు జరుగుతున్నాయి. గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమంలో ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు పర్యటించినప్పుడు నేలటూరు గ్రామస్తులు పలు సమస్యలను ప్రస్తావించారు. వాటి పరిష్కారానికి ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు నిధులు మంజూరు చేయించారు. ఎంపీపీ మేడిశెట్టి సత్యవేణి, జెడ్పీటీసీ సభ్యుడు పుట్టపూడి అబ్బు, సర్పంచ్ కుక్కల వీరన్న, ఎంపీటీసీ సభ్యులు రుద్రాక్షుల వీరగౌరీకుమారి, ఉప సర్పంచ్ శనక్కాయల దొరబాబు, పంచాయతీ సభ్యులు చొరవతో ఈ నిర్మాణ పనులు సాగుతున్నాయి. శనివారం రహదారి నిర్మాణాన్ని పంచాయతీ రాజ్ జేఈ డీవీ రాఘవులు పరిశీలించారు. ఆయన వెంట సచివాలయ ఇంజినీరింగ్ అసిస్టెంట్ నిమ్మకాయల పద్మరాజు ఉన్నారు.

వేగానికి వెయ్యాలి కళ్లెం



ప్రమాదాలకు నిలయంగా మారిన తామరపల్లి వద్ద మలుపు

కె.గంగవరం: తామరపల్లి గ్రామ ప్రారంభంలో మలుపు ప్రమాదాలకు నిలయంగా మారింది. ఇక్కడ రెండు ప్రమాదకర మలుపులు ఉండడం, పక్కనే చెరువుతో ప్రమాదాలు జరుగుతున్నాయి. వేగంగా వచ్చిన ప్రయాణికులు ఇప్పటికే ప్రమాదాల బారిన పడి గాయాల పాలయ్యారని స్థానికులు అంటున్నారు. ప్రస్తుతం ఇసుక లారీలు ఆ మలుపుల వద్ద వేగంగా వెళ్తుండటంతో ఆందోళన నెలకొంది. ఇప్పటికైనా అధికారులు స్పందించి స్పీడ్ బ్రేకర్లు ఏర్పాటు చేయాలని ప్రజలు కోరుతున్నారు.

నాఫెడ్ కొనుగోలు కేంద్రాన్ని సద్వినియోగం చేసుకోవాలి



అంబాజీపేటలో నాఫెడ్ కొబ్బరి కొనుగోలు కేంద్రాన్ని పరిశీలిస్తున్న రాజ్యసభ సభ్యుడు బోస్

అంబాజీపేట: ప్రభుత్వం ఏర్పాటు చేసిన నాఫెడ్ కొబ్బరి కొనుగోలు కేంద్రాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని రాజ్యసభ సభ్యుడు పిల్లి సుభాష్‌చంద్ర బోస్ అన్నారు. అంబాజీపేట మార్కెట్ యార్డులో నిర్వహిస్తున్న నాఫెడ్ కొనుగోలు కేంద్రాన్ని శనివారం బోస్ పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ కొబ్బరి రైతులకు ఇబ్బందులు లేకుండా కొబ్బరిని కొనుగోలు చేయాలన్నారు. కొనుగోలు చేసిన వారం రోజుల్లో రైతుల బ్యాంకు ఖాతాల్లో జమ చేస్తామన్నారు. బ్రాహ్మణ కార్పొరేషన్ చైర్మన్ పీకే రావు, సొసైటీ అధ్యక్షుడు వాసంశెట్టి రాంబాబు, వైఎస్సార్ సీపీ మండల శాఖ అధ్యక్షుడు వాసంశెట్టి చినబాబులు ఆయన వెంట ఉన్నారు.